వైభవంగా గణేశ్ నిమజ్జనం


మడకశిర: మారుతీనగర్ నుంచి గణేష్ విగ్రహాన్ని తరలిస్తున్న మహిళలు


గుడిబండ: ఊరేగింపులో పాల్గొన్న యువకులు


మడకశిర: హుషారుగా డ్యాన్స్ చేస్తున్న యువత

మడకశిర: జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై .. గణపతి బప్పా మోరియా నామస్మరణతో మడకశిర పట్టణం మార్మోగింది. మడకశిరలో మంగళవారం రాత్రి గణేష్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. బొజ్జ గణపయ్యలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో కొలువుదీరిన వినాయక విగ్రహాలన్నీ పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి అమరాపురం రోడ్డు, వేమన సర్కిల్ గుండా మడకశిర చెరువు వద్దకు తరలించారు. ముందుగానే ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్‌లో గణనాథులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా ఆధ్వర్యంలో స్థానిక సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐలు, పోలీసులు సిబ్బంది కట్టుదిట్టంగా బందోబస్తును పర్యవేక్షించారు.

రొళ్ల: మండల కేంద్రమైన రొళ్లలో మంగళవారం సాయంత్రం వినాయక నిమజ్జనం సందడిగా జరిగింది. విగ్రహన్ని ట్రాక్టర్‌లో కూర్చొబెట్టి దప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు.అనంతరం సమీపంలో వున్న చెరువులో నిమజ్జనం చేశారు.


రొళ్ల: లంబోదరుడిని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు


మడకశిర: నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

రొద్దం: మండల కేంద్రంలో వినాయక విగ్రహల నిమజ్జన మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాడారు. అయితే రవి అనే వ్యక్తి రూ 19,100కు లడ్డూ దక్కించుకున్నారు. పెనుకొండ సీఐ కరుణాకర్ బందోబస్తును పర్యవేక్షించారు.

గుడిబండ: పట్టణంలో కొలువుదీన గణనాథునికి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా చెరువు వద్ద తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.


రొద్దం: వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

క్లుప్తంగా

కోనేరును శుభ్రపర్చండి


గుడ్డం కోనేరు పరిసరాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: గుడ్డం కోనేరులో గణపతి విగ్రహాలు, పూజా సామగ్రితో పాటు కోనేరు చుట్టుపక్కల చెత్తా చెదారాన్నీ శుభ్రపరచి ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. రెండురోజులు పాటు జరిగిన వినాయక నిమజ్జనాలు పూర్తికావడంతో గుడ్డం కోనేరును చైర్‌పర్సన్ పరిశీలించారు. వినాయక నిమజ్జనంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసులు అధికారులకు, విద్యుత్ సదుపాయలు కల్పించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నమన్నారు. ముఖ్యంగా నిమజ్జన సమయంలో మున్సిపల్, పారిశుధ్య కార్మికులు చేసిన సేవ అభినందనీయమన్నారు.

మతిస్థిమితంలేని వృద్ధుడి మృతి

గుడిబండ: పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో మతిస్థిమితంలేని శివప్ప (65) అనే వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రంలోని పావడగ తాలుకాలోని మద్దేవు గ్రామానికి చెందిన శివప్ప మతిస్థిమిత లేక గ్రామ గ్రామానా తిరుగుతూ గుడిబండ వచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న శివప్ప అన్న కుమారుడు గుడిబండకు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్తామని తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆకతాయిలపై చర్య తీసుకోండి


హెడ్‌కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి సమీపంలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం విద్యార్థినుల తల్లిదండ్రులు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆకతాయిలకు బుద్ధి చెప్పేందుకు వెళ్లిన తమపైనే దాడులు చేశారని, వెంటనే వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

30 నుంచి హెల్త్ క్యాంపులు

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకూ హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. హెల్త్ కార్యదర్శులు, ఆశావర్కర్లు, వలంటీర్లు ఇంటింటినీ సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలోని 43 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో గర్భిణులు, బాలింతలకు, రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 30న ముద్దిరెడ్డిపల్లి, అక్టోబర్ 4న శ్రీనివాసనగర్, 10న నింకంపల్లి, 16న ఇందిరానగర్, 28న లక్ష్మీపురం హెల్త్‌సెంటర్లలో హెల్త్‌క్యాంపులు జరుగుతాయన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


డ్రైనేజ్ పనులు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం (గ్రామ సచివాలయం) నిధులతో మంగళవారం డ్రైనేజ్ నిర్మాణ పనులను సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి ప్రారంభించారు. రూ.4 లక్షలతో పనులు చేపట్టామన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. స్థానిక సెబ్ స్టేషన్‌లో మంగళవారం మట్కా నిర్వాహకుల అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని కదిరిగేటు సమీపంలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించి మట్కా నిర్వహిస్తున్న రామంజినేయులు, లింగమయ్య, భద్రాచారిలను అరెస్టు చేసి వారి నుంచి రూ.10770లు నగదు, రెండు సెల్‌ఫోన్లు, 11 మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు కృష్ణవేణి, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' సద్వినియోగం చేసుకోండి


గోరంట్ల: గౌనివారిపల్లిలో ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథగుప్త


అగళి: ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అగళి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు శివానంద, గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హల్లికేర, హెచ్‌డీ హళ్లి, ఇనగలురు, ఇరేగేపల్లి, అగళి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా రావుడి, నరసంబుది, కోడిపల్లి సచివాలయాల్లోని ఉద్యోగులతో ఎంఎల్‌ఓ ఓబులేసు సమావేశమైన పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శివన్న , పంచాయతీ కార్యదర్శి వేణు, నాయకుడు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీఓ రఘునాథగుప్తా పేర్కొన్నారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వందశాతం సర్వే నిర్వహించాలన్నారు. మండల పరిధిలోని గౌనివారిపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని గ్రామ వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. సర్వే తీరుతెన్నులను ఎంపీడీఓ రగునాథగుప్తా పరిశీలించారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని రత్నగిరి, బీజీహట్టి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందన్నారు. సర్వేలో గుర్తించిన రోగులకు ఈ నెల 30న రత్నగిరిలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. ఆయన మంగళవారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై మాట్లాడారు. 2007లో మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రాంభించారని తెలిపారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ పథకాన్ని ఎంతో పకడ్బందీగా అమలు చేస్తున్నారన్నారు. రూ.1000 దాటితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని తెలిపారు. రూ.5 లక్షల ఆదాయ పరిమితి వరకు కూడా ఈ పథకాన్ని తమ ప్రభుత్వం వర్తింపజేసిందని తెలిపారు. ఈ పథకం కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ప్రభుత్వం 3 నెలల వరకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోని పెండింగ్ బిల్లులను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు.

ఘనంగా జలధి ఉత్సవం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో వెలసిన కొల్లాపురి అమ్మవారి జలధి ఉత్సవాన్ని భక్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాన్ని ఉప్ప వంక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ గంగా జలంతో శుద్ధి చేసి ప్రత్యేకంగా జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ఊరేగింపుగా ఆలయం తీసుకురాగా మహిళలు కడవలతో నీటిని ధార పోసి మొక్కులు చెల్లించుకున్నారు.


ఉత్సవ విగ్రహన్ని ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం


గౌడనకుంటలో జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని గౌడనకుంట, దేవగానపల్లి, నగోనపల్లి, పుల్లీకుంట, వీరాపురం , కాచికుంట, హాలుకూరు గ్రామాల్లో మారెమ్మ, గౌడచంద్రమ్మ అమ్మవార్లకు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్లను శుభ్రం చేసుకుని ఉపవాస దీక్షలతో పిండితో తయారు చేసిన కలశాలను ఏర్పాటు చేసుకుని ఆయా గ్రామాల్లో గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వరకూ చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతులను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులకు విందు భోజనాలను ఏర్పాటు చేశారు.

పలువురిపై కేసుల నమోదు

హిందూపురం అర్బన్: పట్టణంలో ఆది, సోమవారాల్లో జరిగిన వినాయక నిమజ్జనం సమయంలో త్యాగరాజనగర్, హస్నాబాద్‌లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ఇరు వర్గాలను ప్రేరేపించేలా వ్యవహరించిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ కంజాక్షన్

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లిలో ఈ నెల 20న వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణకు సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై పెనుకొండ ఇన్‌చార్జ్ డీఎస్పీ కంజాక్షన్ మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన సుజాత నివాసం వద్దకు వెళ్లి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే సాక్షులను విచారించారు. ఈ కేసులో ఇప్పటికే 18 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని, ఉన్నతాధికారులకు దర్యాప్తు నివేదికను పంపుతామని డీఎస్పీ తెలిపారు.

ఏపీఆర్‌ఎస్ విద్యార్థి ప్రతిభ


రాష్ట్రస్థాయికి ఎంపికైన నితీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి మాస్టర్ నితీష్ ప్రతిభ ప్రదర్శించాడు. టీసీఎస్ రూరల్ ఐటీ నేషనల్ క్విజ్ కాంపిటేషన్‌లో మాస్టర్ నితీష్ జిల్లా రీజినల్ లెవెల్ కాంపిటేషన్‌లో ఉత్తమ ప్రతిభను చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్వీ మురళీధర్‌బాబు తెలిపారు. ఆ కాంపిటేషన్‌లో రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికకావడంతో ఉపాధ్యాయ బృందం నితీష్‌ను అభినందించింది.

కర్ణాటక బస్సును ఢీకొన్న లారీ


బస్సు వెనుక భాగం దెబ్బతిన్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిలో కోడూరు థామస్ మన్రో తోపు వద్ద మంగళవారం మంత్రాలయానికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును లారీ వెనుక వైపు నుంచి ఢీ కొంది. అయితే బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం దెబ్బతినడంతో ఆర్టీసీ బస్సు, లారీని పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మత పెద్దలకు సన్మానం


మత పెద్దలను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

హిందూపురం అర్బన్: పట్టణంలో ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనానికి సహకరించిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలను పోలీసులు సన్మానించారు. మంగళవారం రాత్రి హిందూపురం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ కంజాక్షన్, సీఐలు శ్రీనివాసులు , సిఐ వై. శ్రీనివాసులు, సిబ్బంది వారిని సన్మానించారు.

పౌష్టికాహారం తప్పనిసరి


సూచనలు ఇస్తున్న సీడీపీఓ శాంతలక్ష్మి

పెనుకొండ రూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. మండలంలోని గుట్టూరు ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిన్నపిల్లల దగ్గరి నుంచి గర్భిణులు, బాలింతల కోసం నిర్వహించే పౌష్టికాహార మహోత్సవాన్ని సీడీపీఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ - సర్వీసుల మొత్తాన్ని చెల్లించండి

పెనుకొండ: ఈ-సర్వీసుల నగదు మొత్తాలను వెంటనే ప్రభుత్వానికి చెల్లించాలని సచివాలయల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ సమావేశపు భవనంలో మంగళవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు సంబంధించిన ఓటీఎస్ నగదు మొత్తం, ఆధార్‌కు సంబంధించిన నగదు, ఇతర ఈ సర్వీసులకు సంబంధించిన నగదు సిబ్బంది వద్ద ఉందన్నారు. వెంటనే సచివాలయంలో నగదు చెల్లించి అక్కడి నుంచి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వం వద్దన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని పలు మీసేవా కేంద్రాలను తనిఖీ చేసి వారి వద్ద ఉన్న పలు ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు.

లాఠీచార్జ్ చేసిన వారిపై చర్య తీసుకోండి

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో శాంతియుతంగా జరుగుతున్న వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో హిందూ సంఘాల నాయకులు చలపతి, మేడికుర్తి హరి, రమేష్‌రెడ్డిలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం రాత్రి ఆర్టీసీ కాలనీ వద్ద వినాయక ఊరేగింపును ఇతర వర్గానికి చెందిన వారు అడ్డుకున్నారన్నారు. అయినప్పటికీ పోలీసులు హిందూ యువకులపై లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. ఈ చర్యపై పోలీసుల ఉన్నతాధికారులతో పాటు కేంద్రం దృష్టికి, ఆర్ఎస్ఎస్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిగి రోడ్డులో అనధికారికంగా కబేళాలు నిర్వహిస్తూ పశువులను వధిస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్, పోలీసులు శనివారం లోపు చర్యలు తీసుకోవాలని, లేకపోతే హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కబేళాలను ముట్టడిస్తామన్నారు.

స్థల వివాదంపై డీఐజీకి ఫిర్యాదు

అనంతపురం క్రైం: రొద్దం మండలం పెద్దకోడిపల్లికి చెందిన అక్కమ్మ, పోతన్న కుటుంబ సభ్యులు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని కలసి స్థల వివాదంపై ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం అనంతపురంలో వినతిపత్రాన్ని అందజేశారు. పెద్దకోడిపల్లిలో 1981లో 21 సెంట్ల ఇంటి స్థలం కొనుగోలు చేశామని, ఆ స్థలంలోనే ఇల్లు కూడా కట్టుకున్నామన్నారు. అయితే ఆ స్థలంలోనే ఇంటి కాంపౌండ్ వాల్ కట్టుకుంటుంటే కొందరు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పలుమార్లు దాడులు, ప్రతి దాడులు చేసుకున్నట్లు చెప్పారు. అన్ని హక్కులూ ఉన్నప్పటికీ తమను ఇబ్బంది పెడుతున్నారని, వారి నుంచి ఎలాంటి ఆటకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ మద్యానికి అడ్డుకట్ట

- రెండు రోజుల్లో 1392 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం


పట్టుబడిన ఆటో, మద్యం

హిందూపురం అర్బన్: కర్ణాటక నుంచి అక్రమ మద్యం రవాణా కాకుండా సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్) అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని తూముకుంట, కొడికొండ చెక్‌పోస్టుల మీదుగా జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకొని 1392 టెట్రా పాకెట్లతో పాటు మూడు బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఆది, సోమ వారాల్లో మోడల్ కాలనీ 2 , వీవర్స్ కానీలో, చిన్న మార్కెట్ సమీపంలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

రొళ్ల: గర్భిణులు వ్యక్తిగత శుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ శశిరేఖ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రి ఆవరణలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని పౌష్టికాహారాలను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, గర్భిణులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న భోజన నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని రోజూ మెనూ ప్రకారం వడ్డించాలని ఎంఈఓ 2 శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని అలుపనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అలుపనపల్లి, రొళ్ల, హెచ్‌టీ హళ్లిలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించారు.

కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలు అందజేస్తున్న ఆప్తమాలిక్ అధికారి అనిల్‌కుమార్

అమరాపురం: మండలంలోని కే.శివరం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద ఎంపికైన 74 మంది రోగులకు కంటి అద్దాలు పంపిణీ చేసేందుకు మంగళవారం స్థానిక ఆరోగ్య కార్యకర్త వన్నూరక్కకు అద్దాలు అందజేసినట్లు గుడిబండ పీహెచ్‌సీ ఆప్తమాలిక్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద ఈ అద్దాలను లబ్ధిదారులకు అక్టోబర్ 5న పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శెట్టూరు ఎంపీపీ సోమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.